## తన జాతి క్షేమం కోసం తనను తాను కామాగ్నిలో భస్మం చేసుకున్న కన్య కథ!

[కథాకాలం : క్రీస్తుపూర్వం 35 ప్రాంతాలు స్థలం : అమరపురి ఆధారం : వాత్స్యాయన కామసూత్రాలు. ఆదర్శం : ఆర్య అనార్య సంగ్రామాలలో అనార్యులు చేసిన అద్భుతమయిన త్యాగాల కథనం. —లల్లాదేవి ]

# భస్మసింహాసనం

— లల్లాదేవి

శ్రీ పర్వత పాదపీఠికల నించి నీలినీలి జీవజలధారలు పొంగి పొరలే నీలాల కృష్ణవేణితో సంగమించేందుకు పరవళ్ళు త్రొక్కుతూ పరుగులు తీస్తోంది చంద్రభాగ. వరదలో చిక్కిన కృష్ణసర్పంలా ఏటివాలుకు ఎదురీదుతోంది మలయవతి. తెల్లగా నురగలు త్రొక్కుతున్న నదీజలాల్లో వల్లని శరీరకాంతి చిత్రంగా వుంది.

ఎదురుగా ఎత్తయిన గిరిశిఖరాలు శ్రీ పర్వతం నీరెండ సోకి తళతళ మెరుస్తోంది. అది అద్భుతమయిన ప్రకృతి సదనం.

ఏటిలో ఎంతసేపయినా ఎదురీదగల శక్తి సంపన్నురాలు మలయవతి. ఎంతోసేపు స్వేచ్ఛగా ఈదులాడి చంద్రభాగా నదికి వీడ్కోలుచెప్పి గట్టుమీద కాలు పెట్టింది. తడి వస్త్రాలను పిండుకుంటూ తలయెత్తి చూసిందామె.

ఎదురుగా కన్పించిన దృశ్యం రవంత కలవర పరచింది. నూనె రాసినట్లు మిలమిల్లాడే శరీరకాంతితో ఒక యవనాశ్వం ఎదురుగా నిలిచి ఉంది.

దానిమీద దీర్ఘకాయుడయిన యువకుడు కూర్చుని ఆమెవంక తదేకంగా చూస్తున్నాడు.

గౌరవర్ణ శరీరం, గోధుమ రంగులో వున్న విశాల నేత్రాలు, ఎర్రని పెదవులు, అడగకుండానే తెలుస్తోంది ఆర్యుడని!

ఆమె తనను గమనించటం చూశాక ఆర్యుడు రవ్వమీసం చాటున చిరునవ్వు మెరిపించాడు. ఎర్రని పెదవులమీదుగా జారిన నవ్వు మందారంమీద నిలిచిన మంచుబిందువులా తళుక్కుమంది.

'ఈ చక్కదనాల చంద్రుడు ఎక్కడనించి వచ్చాడా?' అని అక్షణం ఆలోచించింది మలయవతి. అంతలోనే, ఆమెకు జ్ఞాపకం వచ్చింది- అతడు ఆర్యుడయి వుంటాడని. ఆ మాట స్ఫురించగానే రవంత కోపం కూడా వచ్చింది.

"అందగాడా! చూపులకు చంద్రుడిలాగే వున్నావు. కాని చేష్టలుచూస్తే శ్రీ పర్వతం మీది వానరానివేమో అనిపిస్తోంది. ఈదులాడే ఆడదానివంక అలా ఎగాదిగా చూస్తావెందుకయ్యా. నీ దారిన నీవు పోరాదా?" అన్నదామె.

అందుకా యువకుడు మళ్ళీ నవ్వాడు— మందార పూవుల మీదినుంచి మంచు ముద్దలు జారుతున్నట్లు.

"మదవతీ! శ్రీ పర్వతం పాదపీఠికలు ప్రకృతిఅందాలకు పుట్టినిల్లుఅని విన్నాను. ఇప్పుడు చూస్తున్నాను. నిజంగా ఈ అందచందాలు అద్భుతమయినవి! ప్రకృతి కాంత ఇంత అందాన్ని ఏ పరమపురుషుని కోసమో కదా దాచుకుంది" అన్నాడు. అతడి చూపులు మలయవతి శరీరాన్ని విడిచి మరొక వంక పోలేదు

"చూపులు నామీద! వర్ణించేది ప్రకృతి అందాలను. ఎంత అసందర్భమయిన ప్రేలాపన ఇది. గుర్రాన్ని అదలించుకోవయ్యా బాటసారీ! గమ్యాన్ని చేరుకుంటావు" అన్నది మలయవతి రవంత చిరాకుగా.

ఆమె చంద్రభాగ— నాగులేరు నదుల మధ్య నివశించే నాగజాతుల వారింటి ఆడపడుచు. తాను ద్రవిడ సంప్రదాయంలో పుట్టినందుకు గర్వించే జాతీయవాదిని.

"ఇక్కడకు వచ్చాక నా గమ్యం చేరుకున్నాననే అనిపిస్తోంది యువతీ! నీ పేరు చెప్తావా? మదవతీ అని పిలవనా?" అని అడిగాడు ఆర్య యువకుడు

అతడు అంతంత మాత్రానికి వదలిపోయేవాడు కాదని అర్థం చేసుకుంది మలయవతి. 'ఆర్యుడికి భయపడి తాను మాత్రం ఎందుకు పారిపోవాలి?' అనుకుంది.

"గమ్యం చేరాననుకున్న వాడివి గుర్రాన్ని దిగవెందుకని?" అన్నదామె. ఆర్యయువకుడు ఆకాశంనించి రాలిపడుతున్న ఉల్కలా చెంగున క్రిందికి దూకాడు.

"మదవతి కాదోయి నా పేరు మలయవతి. ద్రవిడుల యింటి ఆడపడుచును. నీవు ఆర్యుడవని అడగకుండానే తెలుస్తోంది. ఎందాకా పోతున్నావయ్యా! ఎదురుగా కన్పించే శ్రీ పర్వత సానువు

శ్లోకాల్లో అక్కడ నివంగులుంటాయి. పుట్టలుంటాయి. వాటిని చూసి బెంబేలు పడతావేమో! ధైర్యం కావలిస్తే నా పేరు స్మరించు" అంటూ పరిహాసం చేసిందామె.

ఆర్యుని గౌరవర్ణ ముఖం విచ్చిన మందారంలా ఎర్రనయింది. "ద్రావిడ వనిత నంటున్నావు. పరాక్రమం గురించి ప్రసంగిస్తున్నావు. బాగుంది. బాగుంది. దానిసలకు కూడా పౌరుష పరాక్రమాలుంటాయన్నమాట! లోతయిన చంద్రభాగలో యీదులాడుటకు వచ్చినప్పుడే అనుకున్నాను. ఆరితేరిన దానవు-అయితే కావచ్చు కాని అంత ప్రవల్లదనమెందుకు? రాజుతో పోటీపడితే యశస్సు ప్రాప్తిస్తుందనా నీ ఆశ?" అన్నాడు ఆర్య యువకుడు

"ఓహో! ఆర్యుడా! నీవు రాజువు కూడానా? నీ పేరేమిటో అడుగవచ్చునా?" అన్నదామె.

"కుంతలుడు నా పేరు. అమరపురి సింహాసనానికి అధినేతను" అన్నాడతడు. మలయవతి అచ్చెరువు పడింది

"రాజా! ఈ రాజ్యాన్ని పాలించే ప్రభువులా మీరు. అయితే మీరే నాకు ప్రధమ శత్రువులు. ఇక్కడి ద్రావిడ గణాలను ధ్వంసం చేసింది మొదటి శాతకర్ణి కదా!

ఆ పరంపరలో వచ్చిన కుంతల శాతకర్ణివి నీవని తెలిస్తే అసలు మాట్లాడక పోదును." అంటూ తల దింపుకుని త్వరిత గతిన వెళ్ళసాగిందామె

కుంతలుడు వేదికలవలె వున్న యిసుక తిన్నెలమీద నూరు ధనుస్సుల దూరం వెంబడించి ఆమె చేయి పట్టుకున్నాడు.

"రాజులంటే భయమా నీకు?" అని ప్రశ్నించాడు

"ఎంత పిచ్చివాడవోయి రాజా నీవు?" అని ఎదురు ప్రశ్నించిందామె.

"రాజులంటే భయంకాదు. ద్వేషం. తరతరాల మా ద్రవిడ సంప్రదాయాలు శిథిలమైనది మీ వల్లనేకదా! నాగ, పుండ్ర, పుళింద గణాలు నామరూపాలు లేకుండా పోవాలని కదా మీ ఆకాంక్ష. మా దక్షిణాది సంపదలను దోచుకుపోయేందుకు మీరు వచ్చారు. మనుషుల రక్తమాంసాలతో బానిస వ్యాపారం చేస్తున్నారు, మీ సార్థవాహులు. మా దక్షిణాపథంనించి ఆముదాలు, తేనె, ఆయుధాలు మొదలయిన సంపదల్ని దోచుకుని ఉత్తరాపథానికి తరలించుకు పోతున్నారు

పొట్ట చేతపట్టుకువచ్చిన మీరు ప్రతాపవంశులమని ప్రకటించుకుంటున్నారు- సిగ్గులేదా?" అంటూ అదలించింది

ఆర్య రాజు వింటిదెబ్బ తిన్న బెబ్బులిలా గుర్రున చూశాడు. కోపంతో కన్నులు ఎర్రపడ్డాయి. ఆర్యుల దృష్టిలో ఆడదాయికి యింత తెంపరితనం కూడదు.

మగవాని అడుగులకు మడుగులొత్త వలసిన ఆడది, అందునా బానిసత్వానికి మాత్రమే అర్హురాలయిన ద్రావిడ యువతి యిలా తెగించటంతో మండిపడి పోయినాడు

కాని ఆమె శరీర సౌందర్యం. దృఢతరమయినభుజాలు. మూపురంలావున్న మెడ, ఇనుప ముద్దల్లావున్న పిక్కలు అతడిని బాగా ఆకర్షించాయి. ఇంత శక్తిసంపద కలిగిన స్త్రీని అనుభవించాలన్న అతని చిరకాల వాంఛ నిద్రలేచింది. అందునించి తనను తాను నిగ్రహించుకున్నాడు

"మలయవతీ! ఆర్యులు ఆటవికులయిన మీకు నాగరికత నేర్పించారు. వైదికమైన విజ్ఞానాన్ని మీకు కొంత కొంత పంచియిస్తున్నారు. దక్షిణాపథానికి ఆర్యులు రాకపోతే ఈ దండకారణ్య ప్రాంతాలన్నీ అజ్ఞానంతో, అవిద్యతో అంధకార బంధురమేకదా! సరే-ఆ సంగతి అలావుంచు

నీవు ఈదులాడుతున్నప్పుడే నాకు మత్స్యగంధి కథ జ్ఞాపకం వచ్చింది. నీ అందచందాలు, శరీర సౌష్ఠవం నన్ను ఆకర్షించాయి

మలయవతీ నేను నిన్ను కామించాను. గాంధర్వ వివాహం చేసుకునేందుకు నీకేమయినా అభ్యంతరమా?" అని అడిగాడు కుంతలుడు.

మలయవతి పకాలున నవ్వింది.

"రాజా! నన్ను పెళ్ళాడేందుకు, అందునా గాంధర్వ వివాహం చేసుకునేందుకు నీ అర్హత ఏమిటి?" అని అడిగింది.

రాజు రవంత సిగ్గుపడ్డాడు. అంతలోనే అభిజాత్యం ఆవులించి నిద్ర లేచింది ఆకలి ఆవురావురుమంది.

"ఓ దస్యు యువతీ! నా ప్రియమైన రాక్షసీ! నేను ఈ కృష్ణాతీర భూములకు రాజును. పాలకుడను. పరాక్రమంలో పేరు ప్రతిష్ఠలు కలవాడను. చూస్తున్నావు కదా! దృఢమూ, సౌందర్యవంతమూ అయిన ఈ శరీరం. ఉజ్వలమయిన నా ముఖకాంతి; కవ్వించే రవ్వ మీసమూ— ఇవన్నీ నా అర్హతలు కావా? నిన్ను గాంధర్వంగా పెళ్ళి చేసుకునేందుకు నాకున్న ఈ అర్హతలు చాలవా?" అన్నాడు

మలయవతి దిక్కులు పిక్కటిల్లేలాగ అతిగా నవ్వింది. పడిపడి నవ్వింది. రాజు నివ్వెరబోయి చూస్తున్నాడు. రవంత



సేపు అయాక నవ్వు ఆపిందామె.

"రాజా ! ఇదంటే ఏమనుకున్నా వయ్యా! అక్షౌహిణీల సైన్యాన్ని జయించ గలవేమోకాని ఒక్క ఆడదాని మనసును జయించలేవు. నీవు విశ్వవిజేతవు కాగల వేమోకాని ఒక ఆడదాని అంతర్యాన్ని అర్థం చేసుకోలేవు

ఓయీ రాజా అందచందాలు నా కెందు కయ్యా ! అందమే కావాలనుకుంటే ఆకా శంలో చందమామ లేదా! మీసాలు బావురు పిల్లికీ ఉన్నాయి-నీ గొప్ప ఏమిటి ?

ఉజ్జ్వలమూ, దృఢతరమూ అని తెగ చెప్పుకుంటున్న నీ శరీరం ఎందరు ఆత్మల్ని చంపుకున్న ఆడవాళ్ళ కౌగిళ్ళలో నలిగి అపవిత్రమయిందో నేను వూహించలేననుకున్నావా ?

ఇంక రాజును పాలకుడను అంటు న్నావు ? ఈ కృష్ణా తీరంలోని ద్రవిడ భూములు నీ అబ్బసొమ్మా ! ఈ చంద్ర భాగను నువ్వు త్రవ్వించావా ? ఆ శ్రీ పర్వతాలను నువ్వు చెక్కించావా! మేం ధరించే నారచీరలు నువ్వు నేయించి యిచ్చావా ? మా విల్లనమ్ములు ఉత్తరా పథంనించి నువ్వు తెచ్చిపెట్టావా ? ఇవన్నీ ప్రకృతి సంపదలు

వీటన్నిటికీ ప్రభువు వున్నాడో, లేదో తెలియని ఆ పరమ పురుషుడే కాని నీవు కావు


రాజు అనేగా నీవెంత ? వేలమంది ద్రావిడుల ముందు నీ శక్తి సామర్థ్యాలు ఎంత? పిచ్చివాడా! ఈ ప్రజలు ఉపే క్షించి ఊరుకున్నారు కనుక నీవు ప్రభు వుగా కొనసాగుతున్నావు. అయినా నన్ను అపేక్షించటం అధర్మం అని నేను అను కోను కాని నన్ను కామించగల శక్తి సంపన్నత నీకు వున్నదో, లేదో— నాకెట్లా తెలిసేది?

లోతు తెలియని ఈ చంద్రభాగలో నాతో సమంగా యీదులాడగలవా?" అంటూ కవ్వించి రిక్క వేసింది మల యవతి. రాజు ఉప్పొంగిపోయినాడు.

"మలయవతీ! ఓ దానవీ! ఒక్క ఈత లోనే కాదు సమస్తమయిన వీర విద్య లలో నీతో పోటీచేస్తాను. నేను జయిస్తే నీవు నన్ను పెళ్ళిచేసుకోవాలి.

నీవు జయిస్తే నీ కోరిక ప్రకారం ఈ ద్రవిడ భూముల్ని విడిచిపోతాను. అమరపురి (అమరావతి) సింహాసనానికి నిన్ను పట్టాభిషేకం చేస్తాను. ఈ పోటీకి నిలుస్తావా?" అంటూ మహోత్సాహంతో ముందుకు వచ్చాడు కుంతలుడు. మలయ వతి అందుకు అరక్షణంకూడా ఆలోచించ కుండా అంగీకరించింది.

చంద్రగభాగలో వేయి ధనుస్సులదూరం ఏటికి ఎదురీదాలని పందెం పెట్టుకున్నారు. అది శ్రీ పర్వత పాదపీఠిక కావటంనించి కొండలమీదినించి ఉరికివచ్చిన ఏటినీరు పరవళ్ళు త్రొక్కుతోంది. ఒడ్డులకు అను కొని ఉన్న పెద్ద పెద్ద వృక్షాలను కూకటి వేళ్ళతో పెకలించి తనతోపాటుతరలిం చుకుపోతోంది.



ఇద్దరూ చంద్రభాగలోకి దిగారు. ఏటికి ఎదురీదటం ప్రారంభించారు. ఐదు వందల ధనుస్సుల దూరం పోయాక కుంతలుని అధిగమించి ముందుకు వెళ్ళింది మలయవతి

ఆ దూరాన్ని అలాగే నిలుపుకుని వెళ్ళిపోతోందామె. అమరపురి సింహాసనం తన వశమౌతోందని ఆనందపడింది. రాజు శరీరమంతా నీరయింది. ధైర్యం దిగజారింది. తుది క్షణాలు సమీపించాయి. మరికొంచెం దూరం వెళ్తే మలయవతి విజేత అవుతుంది. కాని విధి అనే వేటగాడు ఆమె ఆశయానికి గురిపెట్టి బాణం కొట్టాడు

అది మొసలి రూపంలో వచ్చి ఆమె కాలు పట్టుకుంది. తన రంపంలాంటి పళ్ళ మధ్య బిగించి పట్టింది. మలయవతి మొలనున్న పిడిబాకును లాగి దాని పొట్టమీద వీపుమీద పదకుమ్మింది. మొసలి ప్రాణాలు కోల్పోతూ ఆవురుమని నోరు తెరచింది. ఆమె మళ్ళీ యీదడం ప్రారంభించింది.

కాని కుంతలుడు అప్పటికే వచ్చి తనతో కలిశాడు. ఇద్దరూ వొకేసారి ఒడ్డుమీద కాలుపెట్టారు విజయం యిద్దరి భుజాలమీద చెరొక చెయ్యి వేసింది.

శరీరాలను అలాగే ఆర్పుకున్నారు. అలుపు తీర్చుకున్నారు

"రాజా. నీవు అదృష్టశాలివి" అన్నది మలయవతి అలుపు తీరాక.

"ఒక భామినితో అందునా ఆడదాయితో పోటీపడి జయించలేకపోయిన మగవాడు అదృష్టశాలి ఎలా అవుతాడు? నిన్ను జయించలేకపోయినందుకు సిగ్గుపడుతున్నాను" అన్నాడు కుంతలుడు బింకంగా.

"రాజా నన్ను గాంధర్వ వివాహం చేసుకునేందుకు యిప్పుడు నీ అర్హత చాలదనుకుంటాను—!" అంటూ రెచ్చగొట్టిందామె కుంతలునిలో క్షాత్రధర్మం నిద్రలేచింది. రాచరక్తం పొంగింది. అభిజాత్య గర్వం ఆకలిగొన్న సింహంలా ఆవులించింది.

"ఓ దస్యువనితా! మదించి ఉన్నానని గర్వించకు. ఈత నేర్చినదానవు కనుకనే నీటిలోతు కొలవగలనేమోకాని రాజు హృదయాన్ని కొలవలేవు ఇక్కడ నాతో సమంగా నిలిచావు.

ఇంకా ఎన్నో వీర విద్యలు మిగిలి ఉన్నాయి. వాటిలో విజయం నాది అయితే నీవు నా దానవు. నా అనుభవం కోసం అంతఃపురాలలో దాచి ఉంచిన అనేక ఆడశరీరాలతో వెళ్ళి కలుస్తావు.

నీవు జయిస్తే అమరపురిలోని రత్నసింహాసనం నీది

పందెం పందెమే! నీవు నిలుస్తావా?" అని అడిగాడు రాజు.

అందుకు అంగీకరించింది. అమావాస్య వెళ్ళి నెల పొడుపునాటికి అమరపురిలో పెద్దమనుగురి సమక్షంలో వీరవిద్యలలో రాజుతో పోటీపడేందుకు అంగీకరించింది మలయవతి.

"రాజా! సింహాసనాన్ని అధిష్ఠించిన మరుక్షణమే నేను కృష్ణాతీరంలో ప్రజాపాలన ప్రకటిస్తాను" అంది

రాజు రవ్వమీసం దువ్వి అశ్వాన్ని అధిరోహించాడు

* * *

శుక్లపక్షంలో తదియనాడు ప్రొద్దుపొడిచింది. ప్రొద్దుపొడుపుతో పాటు కోటవాకిట నిలిచింది మలయవతి. ధర్మగంటను మ్రోగించింది. ఆ ముహూర్తం కోసమే ఎదురుచూస్తున్నవాడిలా రాజు క్షణాలమీద




ఆమె యెదుట ప్రత్యక్షమయినాడు

మలయవతికి రాచమర్యాదలు జరిగాయి. విశాలమయిన ఒక గృహాన్ని ఆమెకు విడిదిగా యిచ్చాడు రాజు. దాసీలు అనేక రకాల ఆయుధాలను తెచ్చి యిచ్చారు. వాటిలో తనకు నచ్చినవాటిని యెంచుకుందామె

పోటీలకు రంగమంతా సిద్ధమయింది. ద్రావిడులు కేవలం దాసీలనే భావిస్తారు ఆర్యులు. అటువంటి ఆర్యులకు తన జాతి పౌరుష పరాక్రమాలను ప్రదర్శించ వచ్చిన మలయవతిని చూసేందుకు కృష్ణాతీరవాసులయిన ద్రావిడులంతా వచ్చారు.

యువకుడు, సాహసి అయిన రాజు తీసుకున్న ఈ నిర్ణయానికి పర్యవసానమేమిటో చూడాలన్న ఉత్కంఠతో ఆర్యులంతా అమరపురికి వచ్చారు. ఔత్తరాహులయిన ఆర్యులు కూడా అధిక సంఖ్యలో వచ్చారు.

నలందనించి ఆర్య పక్షపాతి అయిన ఒక వృద్ధ బ్రాహ్మణుడు వచ్చాడు. అతడు చాలకాలం నలందలో ఒక గురుకులాన్ని నడిపాడు. ఆర్యులకు మాత్రమే విద్యాబుద్ధులు నేర్పాడు. ప్రస్తుతం తలపండిపోయి వయోభారంవల్ల విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఆర్యరాజు ఒక ద్రావిడ వనితతో ముఖాముఖీ వీర విద్యలలో పోటీ పడినాడని వినగానే అతడిలో ఆర్య రక్తం పొంగింది. లేనిశక్తిని కూడదీసుకుని పోటీలు చూడవచ్చాడు

రాగానే రాజును కలిసి "రాజా! నీవు ఆయుష్మంతుడవు కావాలని ఆశీర్వదిస్తున్నాను. ముఖాముఖీ యుద్ధానికి ఒప్పుకుని ద్రావిడ వనితకు ఒక ప్రాతిపదిక కల్పించావు.

అయినా మించిపోయింది లేదు నీకు విజయం తప్పదు. నేనున్నాను. ఈ పోటీలలో క్లిష్టమయిన చిక్కు ఎదురయినప్పుడు నీవు నన్ను కలుసుకో! నేనిచ్చే సలహా పాటించు" అని చెప్పాడు. రాజు అందుకు అంగీకరించాడు.

వీర విద్యలలో పోటీలు ప్రారంభమయినాయి.

వేలాది సంఖ్యలో వచ్చి చేరిన ఆర్య అనార్య సంఘాలతో క్రీడాస్థలి కిటకిటలాడుతోంది. కుంతము తోమరము, చామరము, ఖడ్గము, రాతిగదలవంటి ఆయుధాలు అనేక రకాలు ఒక ప్రక్కన పెట్టి ఉన్నాయి.

ముందుగా విలువిద్యలో పోటీ జరపాలని న్యాయమూర్తులు నిర్ణయించారు. కుంతలుడు, మలయవతి ఇంకా రాలేదు. వారి రాకకోసం ఆర్య ద్రావిడులు ఎంతో ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. కొద్ది

క్షణాల తరువాత ప్లుతగతిలో రెండు యవనాశ్వాలు వచ్చి వారిమధ్య నిలిచాయి

ఆకాశంనించి రాలిపడుతున్న మబ్బు తునకలా గుర్రంమీదినించి ఛెంగున దూకింది మలయవతి. ఆర్యరాజుకు మైత్రీపూర్వకంగా చేయి అందించింది.

ఆ చేయి అందుకుని క్రిందికి దూకాడు రాజు. ప్రత్యర్థులిద్దరూ చెట్టా పట్టాలు వేసుకుని రణస్థలిలోకి వచ్చారు. న్యాయమూర్తులు వచ్చి తమ నిర్ణయాన్ని తెలిపారు

వారికి విల్లు నమ్ములు అందించబడ్డాయి. ఆకాశంలో వలయాలు తిరుగుతూ, గిరికీలు కొడుతున్న గోరువంకను గురిచూసి సువ్వున బాణం కొట్టాడు కుంతలుడు.

అది మరుక్షణంలో నేలమీద పడింది రక్తపు మడుగులో.

విజయ గర్వంతో చూశాడు రాజు.

"రాజా! మన విద్యా ప్రదర్శన కోసం అమాయక ప్రాణి అయిన ఆ గోరువంకను కొట్టడం ధర్మం కాదు" అన్నది మలయవతి.

"వ్యర్థమయిన మాటలెందుకు. చేవ వుంటే అల్లెత్రాడు బిగించు" అన్నాడు కుంతలుడు. మలయవతి ఎక్కడో గురిచూసి కొట్టింది. ఆ బాణం సువ్వున వెళ్ళి ఎక్కడో తగిలింది. తగలవలసినచోటుకే తగిలింది. మరికొద్ది క్షణాల తర్వాత ఒక డేగవచ్చి వారిద్దరి మధ్య పడింది. అది ఎక్కడో ఆకాశంలో చాల ఎత్తున ఎగురుతోంది. దాన్ని ఆమె గురిచూసి కొట్టగలదని ఎవరూ అనుకోలేదు.

"రాజా! నేను కూడా పక్షినే కొట్టాను. కాని గోరువంకను కాదు. మా నాగులతో జాతివైరం వున్న గ్రద్దను కొట్టాను" అన్నదామె


ద్రావిడులు జేజేలు పలుకుతూ హర్ష ధ్వానాలు చేశారు.

ఆ తరువాత చిత్రవిచిత్ర గతులలో బాణప్రయోగాలు ప్రదర్శించారు. మునిమాపువేళకు ఇద్దరు ప్రత్యర్థులూ సమానమయిన ప్రజ్ఞాపాటవాలు కలిగినవారేనని న్యాయమూర్తులు నిర్ణయించారు

రాజుకు తలవంపు అయింది. ద్రావిడులు మలయవతిని శ్లాఘించారు.

'అమరపురి సింహాసనాన్ని జయిస్తాను. వెంటనే ప్రజాపాలనను ప్రకటిస్తాను. అందుకు ఇంకా కొంత సమయం కావాలి' అని తన వారికి చెప్పుకుని తన విడిదికి వెళ్ళిపోయిందామె.

మరునాడుమళ్ళీ ఖడ్గచాలనంలో పోటీతో ప్రారంభమయింది. ఆ పట్టున పోటీలు అయిదు దినాలు జరిగినాయి. తోరము, కుంతము, రాతిగదలు ఉపయోగించటంలో




నేర్పరితనం పరీక్షలు జరిగాయి గుర్రపు స్వారీలోకూడా ఇద్దరూ సమఉజ్జీలుగా నిలిచారు.

అయిదవనాటి రాత్రి రాజు తన ఉద్యానవనంలో సర్వస్వాన్ని కోల్పోయినవానిలా కూర్చున్నాడు. ఆర్యులు యుద్ధ విద్యా విశారదులు అన్న కీర్తి ఈ ద్రావిడవనిత ముందు తేలిపోతోంది.

పోయే పరువును నిలుపుకోవటం ఎలా?

అమరపురి సింహాసనం అనార్యుల కైవసం కావలసిందేనా? ఆ ఊహ రాగానే రాజు మనసు వ్యధాకులితమయింది

అంతలో నలందనించి వచ్చిన వృద్ధ ఆర్యుడు రాజుముందుకు వచ్చి నిలిచాడు. "యశో ప్రాప్తిరస్తు" అని దీవించాడు.

"వృద్ధమూర్తీ! ఆర్యుల యశస్సు దిక్కులను తాకింది. కాని యిప్పుడా యశస్సుకు కళంకం వచ్చిపడుతోంది, ఇదంతా నావల్లనే కదా!" అన్నాడు కుంతలుడు దిగులుగా.

"చిరంజీవీ! నీకు చిక్కు సమస్య యెదురు అయితే నేనున్నానని చెప్పాను కదా! వీరవిద్యలన్నింటిలో ఆమె నీకు సరిజోడు. కాని అంతమాత్రంచేత మన యశస్సుకు యెటువంటి కళంకమూ రాదు. ఎప్పుడయినా స్త్రీకన్నా పురుషుడు అధికుడే!

ఆ ఆధిక్యతను ప్రకృతి నిర్దేశించింది

నేను నలందలో అర్థశాస్త్రంలోనూ, కామశాస్త్రంలోనూ అధ్యాపకుడుగా పని చేశాను. నీకు కొన్ని రహస్యాలను చెప్తాను. ఆమెను అర్ధాంగిగా స్వీకరించు" అంటూ కొన్ని కామ సూత్ర రహస్యాలను బోధించాడు వృద్ధుడు.

దక్షిణ నాయకుడయిన రాజు ఆ రహస్యాలను అవగతం చేసుకుని ఆనందపరవశుడయినాడు.

'మలయవతీ, ఇక నీకు ఓటమి తప్పదు' అనుకున్నాడు మనసులో.

మరునాడు సభ జరిగింది. యుద్ధ విద్యలలో రాజు ఓడిపోలేదు. మలయవతి ఓడిపోలేదు. ఆ ఇద్దరికీ సమఉజ్జీ అయినవారు ఆ రాజ్యంలో మరొకరు లేరు అని తేల్చారు న్యాయమూర్తులు. ఆ ఇద్దరూ విడిపోయి ఒకరికొకరు ప్రత్యర్థులుగా జీవించటంకన్నా కలిసి బ్రతకటం మంచిదని సలహా యిచ్చారు. అందుకు మలయవతి అంగీకరించలేదు.

నలంద నుంచి వచ్చిన వృద్ధ ఆర్యుడు ముందుకొచ్చాడు. "మలయవతీ! నిన్ను పెళ్ళి చేసుకోవాలన్న కోరికతో రాజు నీతో పోటీపడ్డాడు. ఈ రాజ్యం ద్రావిడుల పరిపాలన క్రిందకు రావాలన్న ఆశయంతో నీవు పోటీకి నిలిచావు. నీవు రాజును పెళ్ళాడు. మీకుకలిగే సంతానానికి ఈ రాజ్య వారసత్వం అప్పగించబడుతుంది. ఇది నీకు అంగీకారమేనా?" అని అడిగాడు

మలయవతి ఆలోచించింది. యుద్ధ విద్యలలో రాజుతో సమంగానిలిచినా తాను జయించలేదు, కనుక సింహాసనందక్కదు ద్రావిడులకు ఈ రాజ్యం అప్పగించటం కోసం తాను మనసుని చంపుకుని రాజు భార్యగా అతని సంతానానికి తల్లి కావటంలో తప్పులేదు

ఆమె మనసంతా తగలబడి చల్లారిన అడవిలా భస్మరాసి అయిపోయింది. తన వారయినద్రావిడులకోసం తలవంచిందామె

వృద్ధుడు ముందే ఇచ్చిన సూచనల ప్రకారం ఆమెను పెళ్ళాడి ఆమె సంతానానికి రాజ్యార్హత కలిగించేందుకు అంగీకరించాడు రాజు.

పెళ్ళి దగ్గరుండి జరిపించాడు వృద్ధుడు.

ఉత్తమ బహుమతి

గానం కొందరినే అలరిస్తుంది. కానీ 'హృదయగానం' అందరినీ స్పందింప చేస్తుంది. జీవితంలో 'అనుభూతి', 'ప్రేమ', 'విలువ', 'విషాదం' అనే రకరకాల రాగాలని తన కలంతో అతి నాజూకైన బాణీలో పలికించిన

శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి

నూతన సృష్టి

"హృదయ గానం"

(డైరెక్టు నవల)

ఆగస్టు నెలాఖరుకు విడుదల

ఇంకా—

వివాహాది శుభకార్యాలకు బహుమతి ఇచ్చేందుకు రుచికరమైన వంటకాలకు ప్రసిద్ధి చెందిన పుస్తకం

శ్రీమతి మాలతీచందూర్

వంటలు–పిండివంటలు

రు. 20–00

మీకు మాంసాహార, శాకాహార వంటల పుస్తకం కావాలంటే

శ్రీమతి ఎం. జయలక్ష్మి

వంటలు–వార్పులు

రు. 10–00

అన్ని పుస్తకాల షాపులలోను దొరుకుతవి. లేదా ఒక రూపాయి తగ్గించి M.O. పంపినవారికి ఆ రూపాయికి V.P.P.లో మీరు కోరిన పుస్తకం పంపుతాము.

క్వాలిటీ పబ్లిషర్స్,
రామమందిరం వీధి,
విజయవాడ–2.

కృష్ణాతీరంలోని ఆర్యులూ, అనార్యులూ అందరూ పండుగలు చేసుకున్నారు. గుమ్మాలకు పచ్చాకు కట్టి, పసుపు కుంకుమలు రాసుకున్నారు.

కొమ్ముబూరలు పూదుకున్నారు. బూత పల్లి బుక్కాయి చల్లుకున్నారు. స్త్రీని బానిసగా, మగవాడి విలాసవస్తువుగా భావించే ఆర్య రాజు పడకటింటిని చేరింది మలయవతి.

ద్రావిడులకు పెళ్ళి అయాక కొద్దికాలం దంపతులిద్దరూ కలిసి నిర్జనావాసాల్లోకి వెళ్ళిపోతారు. కొంతకాలం యథేచ్ఛగా తిరిగి వస్తారు. కాని స్త్రీలు పెళ్ళి అయింది మొదలు నాలుగు గోడలమధ్యన పడి వుండాలి అన్నది ఆర్యుల సంప్రదాయం.

ద్రావిడుల భవితవ్యం కోసం అలా వుండేందుకు అంగీకరించింది మలయవతి. కాని భర్తకోసం బొమ్మను అలంకరించినట్లుగా తనను అలంకరిస్తుంటే చిరాకు పడింది

పసిమివర్ణం హొంబట్టు చీరను చింపి వేసి, ఆభరణాలన్నింటిని లాగి అవతల పారేసి ఒక నారచీర కట్టుకుని పడకటింటికి వచ్చింది. ఆభరణాల ఆడంబరాలతోనూ, పట్టు పీతాంబరాల పెరపెరలతోనూ విసుగెత్తి వున్న రాజును ఈ ద్రవిడకాంత నిసర్గ సౌందర్యం అమితంగా ఆకర్షించింది

కాని మరుక్షణంలోనె వృద్ధుని బోధలు జ్ఞాపకం వచ్చాయి. రాజుగా చిరకాలం మనదలచుకున్నవాడు తనంత వారిని మరొకరిని రాజ్యంలో బ్రతికి ఉండనివ్వకూడదు

రాజు ఉచితానుచితాలు మరచాడు. ఆర్య రాజుల కీర్తి కేతనం ఆంధ్ర దేశప విహాయస వీధుల్లో రెపరెపలాడాలి! అందుకోసమయినా శక్తిశాలిని అయిన ఈ ద్రవిడ వనితను అంతం చెయ్యాలి!

కాని... ఆమె నవ వధువు.

బ్రతుకంతా తన చేయిపట్టి నడువవలసిన పురుషుని కోసం— తన వాడయిన పురుషుని కోసం— అంగలారుస్తూ శోభన గృహంలో కాలుపెట్టిన నవ వధువు.

అశుభం శుభం తెలియని కన్య!

తాను? తాను దక్షిణ నాయకుడు. అనేక మంది మదవతుల కౌగిళ్ళలో శరీరాన్ని శుష్కింప చేసుకున్నవాడు. శృంగార లోకపు పారమ్యాలను దర్శించిన అనుభవశాలి

శృంగార లోకంలో ఆమె లేడి. తాను పులి!! మానవ రక్తాన్ని రుచిమరిగిన రెండుకాళ్ళ పులి!

క్రీడ ప్రారంభమయింది. అనేక యుద్ధ క్రీడలలో అతనికి సరిజోడుగా నిలిచిన మలయవతి శృంగారక్రీడలో అతని ముందు పరాజయాన్ని అంగీకరించక తప్పలేదు

ఆమె చేస్తున్న మొరొమ్మొర ధ్వనులను అతడు లక్ష్యపెట్టలేదు. ఆమె చేస్తున్న మణికూజితాలకు అతడు మరింత క్రూరుడయినాడు

మరికొంత సేపటికి నాలుగవ ఝాము ఆరంభమవుతుందనగా మలయవతి శక్తిహీనురాలయిపోయింది.

అదే అదను. నలందనించి వచ్చిన ఆర్య పక్షపాతి అయిన వృద్ధ బ్రాహ్మణుడు బోధించిన బంధాలను ప్రయోగించాడు రాజు. మలయవతి శరీరం గానుగలోంచి వెలికివచ్చిన చెరకు పిప్పిలా అయింది.

ఆ సమయంలో ఆమె పూర్తిగా శక్తిహీనురాలయి వున్న క్షణాలలో ఆర్యరాజు విజృంభించాడు.

ఆ అమాయకురాలి శరీరం మీద "కర్తరీ" బంధాన్ని ప్రయోగించాడు. మణికూజితాలు చేసేందుకే కాదు మూలిగేందుకు కూడా శక్తి హీనురాలయింది మలయవతి.

ఆమెకు శ్వాసకూడా అందలేదు. రాజు పట్టినపట్టు విడువలేదు. ఆమె ప్రాణవాయువుల ఉత్క్రమణం అవుతున్నాయి. క్రూరుడయిన రాజు కరుణించలేదు.

మలయవతి శ్వాస శాంతమయిపోయింది. ఒళ్ళు చల్లబడింది తన జాతి జనుల శ్రేయఃకామనతో అమరపురి సింహాసనాన్ని ఆశించిందామె. తన వారయిన ద్రావిడులకోసం తన దేహాన్ని ఆర్యరాజుకు పెళ్ళి పేరుతో అప్పగించింది.

ఆమె ఆశించింది అమరపురి సింహాసనం!

కాని ఆమెకు దక్కింది!– కట్టెలలో శరీరం దహించుకుపోగా ఆత్మ చిర విశ్రాంతమయ్యేందుకు మిగిలిన బూడిద! భస్మ సింహాసనం!!

